రక్తదానాన్ని మించిన దానం లేదు : బీఆర్‌ఎస్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్ ముదిరాజ్

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని మించిన దానం లేదని, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ సూచించారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో ప్రతిమ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మాజీమంత్రి హరీశ్‌రావు జన్మదినం పురస్కరించుకుని మంగళవారం రాంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.నాగేష్ ముదిరాజ్ రక్తదానం ప్రారంభించి యువతకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్ అకాడమి నిర్వాహకులు విక్కి మాస్టర్, బీఆర్‌ఎస్ నాయకులు జెల్ల భిక్షపతి, నేత శ్రీనివాస్, రింకు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి



రాంనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రాంనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఆబెద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... అన్నదానం మహాదానం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, ఆకుల అరుణ్ కుమార్, జెల్ల భిక్షపతి, మాధవ్, శ్యామ్‌సుందర్, నేత శ్రీను, ఖదీర్, రాజు గౌడ్, ముదిగొండ మురళి పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ రామానుజులరెడ్డికి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ముస్లింలు అధికంగా ఉన్నారని బక్రీద్ పండుగ సందర్భంగా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు. జంతు వ్యర్థాలను ఎత్తివేయడానికి 25వేల ప్లాస్టిక్ బ్యాగ్‌లు, 3 జేసీబీ వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు అదనంగా 25 చెత్త లారీలను ఏర్పాటు చేయాలన్నారు.

నిర్ణీత వేళల్లో పార్కును తెరవాలి : కార్పొరేటర్

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టిపోతున్న ఓపెన్ జిమ్‌లు, ఆటపరికరాలు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ స్పందించారు. చిక్కడపల్లి వివేకానగర్ పీపుల్స్‌పార్క్‌ను నిర్ణీతవేళల్లో సందర్శకుల సందర్శనార్థం తెరిచి ఉంచాలని ఓపెన్ జిమ్‌ను ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అశోక్‌నగర్‌లోని ఓపెన్ జిమ్ విషయంలో కూడా అందరు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కాలనీ కమిటీ సభ్యులకు తెలిపారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ ఆవరణలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 4 నుంచి 6 వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ తెలిపారు. 6న విగ్రహప్రతిష్ఠ ఉంటుందన్నారు. గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో నల్లపోచమ్మ దేవాలయంలో కూడా బుధవారం నుంచి 6వ తేదీ వరకు రేణుకాఎల్లమ్మ, నల్లపోచమ్మ విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

22న బ్రాహ్మణ ఉచిత మెగా వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీఓ) చిక్కడపల్లి స్వర్ణోత్సవాల సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో రుక్మిణీపాండురంగ స్వామి కల్యాణ మహోత్సవం, బ్రాహ్మణ ఉచితమెగా రాష్ట్రస్థాయి వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డా.ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 22న న్యూనల్లకుంట సహకార గృహ నిర్మాణ సంస్థ కమ్యూనిటీహాల్, న్యూనల్లకుంటలో జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9390646539, 9866154760, 9100414469 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రత్నాకరశర్మ కళారంగ సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రత్నాకరశర్మ కళారంగ సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని జవహర్‌బాలభవన్ మాజీ డైరెక్టర్ డా.ఎంకే.రాము అన్నారు. నాట్యాలయ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సచ్చిదానంద కళాపీఠం అధ్యక్షుడు రత్నాకరశర్మ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కళాభారతి సిటీకల్చరల్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా నృత్యాలయ శిష్యులు కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం ఎంకే.రామును సత్కరించారు. ప్రముఖులు మాల్యాద్రి, కందాల హరిణి, వేణు, సంగీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 13 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సివిల్ సప్లై ఏఎస్‌వో దీప్తి, సూపరింటెండెంట్ వరలక్ష్మి, ముషీరాబాద్ పోలీసులు వివరాలను తెలిపారు. ముషీరాబాద్‌లో నివసిస్తున్న మోయిజ్, అల్లావుద్దీన్ బాకారంలో తక్కువ ధరకు రేషన్ బియ్యం తీసుకుని, ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వే పీఎస్ ఎదురుగా ఫుట్‌పాత్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి(60) చనిపోయి ఉండగా ప్రయాణికులు మంగళవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారరు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గోపాల్

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపు నిచ్చారు. మంగళవారం కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో 97మందికి షాదీముబాకర్, కల్యాణలక్ష్మి పథకం కింద 62 మొత్తం 159మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఏ పావని వినయ్‌కుమార్, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్ర మానికి తహసీల్దార్ అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, కవాడిగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధానకార్యదర్శి ఎన్‌డి సాయికృష్ణ, కాంగ్రెస్ డి విజన్ అధ్యక్షుడు పోతరాజు బాస్కర్, నాయకులు రాజశేఖర్‌గౌడ్, కొండా శ్రీధర్‌రెడ్డి, వైశ్రీనివాస్‌రావు, రాకేష్, ప్రవీణ్, కాంగ్రెస్ నేతలు అంజయ్యగౌడ్, సాయిబాబా, చంద్రశేఖర్, శ్రీనివాస్, యాదగిరిగౌడ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, అభిషేక్ కెనడి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ నెల 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ తెలిపింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బత్తుల సోమన్న, క్రిష్టోఫర్ మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారని, వీటి అమలును రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రకటించకపోవడంతో ఉద్యమకారులు నిరాశతో ఆందోళనకు సిద్ధమయ్యారని తెలిపారు. శాంతియుతంగా అన్ని జిల్లాల్లో నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.మాధవిరెడ్డి, సుమతి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఏకైక లక్ష్యం



డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పార్టీలు అని, ఆ తర్వాత పార్టీలకతీతంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని శంకరమఠం కూరగాయల వీధి రూ.3.50లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ వీధిలో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని అయిదు మున్సిపల్ డివిజన్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్ ముదిరాజ్, సాయినిమూర్తి, మహిళా నాయకురాలు ఇర్ఫానా సుల్తాన, స్వప్న, రమణానాయుడు, కూర నరేందర్, బీజేపీ నాయకులు ఎం.బి.కిషోర్‌కుమార్, పెంటం, ధర్మేందర్, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, జలమండలి అధికారులు ముకుంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది



అక్రమ కట్టడాలను కూల్చివేసే పనులను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, పోలీసులు

అనుమతిలేని ఫ్లోర్ల కూల్చివేత

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ అరవింద్‌నగర్ కాలనీలో హైకోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం అనుమతిలేని ఫ్లోర్లను కూల్చివేశారు. ఈ కూల్చివేతలు తూతూ మంత్రంగా జరిపి, టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఐదు సంవత్సరాల క్రితం ఓ ఇంటి యజమాని నిర్మించిన ఇంటికి జీప్లస్+2 అనుమతి ఉండగా, మరో రెండు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్‌ను అక్రమంగా నిర్మించారు. అయితే నిర్మాణంపై గతంలో స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో స్థానికంగా భవనం పక్కనే ఉండే మనోహరమ్మ భవన నిర్మాణం, అధికారుల పనితీరుపై హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు తీర్పు ప్రకారం అనుమతి లేని అంతస్తులను కూల్చాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గం సర్కిల్ 15 టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, దోమలగూడ పోలీసుల సహకారంతో మంగళవారం ఉదయం అరవింద్‌నగర్ కాలనీకి వచారు. అక్రమంగా నిర్మించిన రెండంతస్తుల భవనం, బాల్కనీని మాత్రమే కూల్చివేసి, మిగతా వాటి జోలికి వెళ్లలేదు. అదికూడా బాల్కనీలో కొంతభాగాన్ని మాత్రమే కూల్చివేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

- ముస్లింల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయింపు
- 30 శాతమే ఖర్చు : మాజీ ఎంపీ అజీజ్‌పాషా
- రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మైనారిటీకి స్థానం కల్పించాలి
- డిమాండ్లను పరిష్కరించాలి
- ఏఐఎంఎంఓ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఎంఏ.సిద్ధిఖీ, సయ్యద్ ముక్తార్ హుస్సేన్ తదితరులు

నల్లకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మాజీ ఎంపీ అజీజ్‌పాషా ఆరోపించారు. ముస్లింల సంక్షేమం కోసం 2024-25 బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం 30 నుంచి 40 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ధ్వజమెత్తారు. ఏపీ రాష్ట్రంలో ముస్లింల కోసం అమలు చేసిన మైనారిటీ సబ్‌ప్లాన్‌ను తెలంగాణ రాష్ట్రంలో పాలకులు విస్మరించారని ఆరోపించారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆలిండియా ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ.సిద్ధిఖీతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ముస్లిం శ్మశానవాటికలు దాదాపు కనుమరుగయ్యాయని, నగర శివారులో 100 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కేటాయించాలన్నారు. ముఖ్యంగా ఇళ్లు లేని పేద ముస్లింలకు 100 గజాల స్థలం కేటాయించాలన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించడంలో పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సయ్యద్ ముక్తార్ హుస్సేన్ మాట్లాడుతూ మైనారిటీ శాఖలలో సిబ్బంది కొరత నెలకొందన్నారు. మైనారిటీ డిక్లరేషన్‌ను అమలు చేసి వక్ఫ్ బోర్డుకు న్యాయపరమైన అధికారాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి చెందిన 5 లక్షల కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని, మంత్రివర్గ విస్తరణలో మైనారిటీకి స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ సత్తార్, మహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి మెమెంటో అందజేస్తున్న ఆలయ ప్రతినిధి

లిబర్టీ టీటీడీలో కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లిబర్టీలో గల తిరుమల దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతికి వెళ్లలేని భక్తులు ఈ ఆలయానికి వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డికి ఆలయ ప్రతినిధి త్రినాథ్ బాబు స్వామి వారి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలు జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నాయకులు

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై బీఆర్‌ఎస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ఆరోపణలు కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు మాజీ చైర్మన్ జి.నాగభూషణం, టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం, రైతుభరోసా, రుణమాఫీ, నిరుద్యోగులకు ఆర్థిక సహకారం, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. వీటిపై బీఆర్‌ఎస్, బీజేపీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వీటిని కాంగ్రెస్ శ్రేణులు జిల్లా, నియోజకవర్గం, డివిజన్ స్థాయిలో తిప్పికొట్టాలన్నారు.

'హరీష్‌రావును విమర్శించే అర్హత టీపీసీసీకి లేదు'

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి హరీష్‌రావును విమర్శించే అర్హత టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ ఎద్దేవా చేశారు. మంగళవారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ద్వారా వివిధ ప్రాజెక్ట్‌లకు అనుసంధానం చేయడంపై మహేష్‌కుమార్‌గౌడ్‌కు అవగాహన లేదన్నారు. హరీష్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

శశిధర్ శిల్పికి శ్రీరామప్ప అవార్డు



శశిధర్ శిల్పిని సన్మానిస్తున్న నాగభూషణంచారి, నవీన్‌రెడ్డి

అంబర్‌పేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ శిలాశిల్పి రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ శిల్పికి శ్రీవిశ్వశిల్పి రామప్ప అవార్డు లభించింది. తెలంగాణ సాంస్కృతిక శాఖ, తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అవార్డు శశిధర్ శిల్పి ఇటీవల అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బీజేపీ అంబర్‌పేట డివిజన్ మాజీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నవీన్‌రెడ్డి మంగళవారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు.

టీఐసీఏఐహెచ్‌సీఎంసీ చైర్మన్‌గా ఖాజా జలాలుద్దీన్



కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ(టీఐసీఏఐహెచ్‌సీఎంసీ) చైర్మన్‌గా 2025-26 సంవత్సరానికి టీఎంఏ ఖాజాజలాలుద్దీన్ ఎన్నికయ్యారు. మంగళవారం దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో ఉన్న సంస్థ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఆయన గతంలో ఫెలోమెంబర్‌గా సేవలు అందించారు. కాస్ట్ అకౌటింగ్ రంగంలో రెండు దశాబ్దాలకుపైగా అనుభవం ఉంది. ముఖ్యంగా కాస్ట్ అకౌంటింగ్, కాస్ట్ అకౌంటింగ్ రికార్డులు, కాస్ట్ ఆడిట్‌లు, ఎంఐఎస్ అకౌంట్స్, ఫైనాన్స్ ఆడిటింగ్ ఆదాయ పన్ను అంతర్గత ఆడిట్‌లు బ్యాంక్ ఆడిట్‌లు జీఎస్‌టీ వంటి విభాగాలలో విశేష సేవలు అందించారు. ప్రస్తుతం ఖాజా జలాలుద్దీన్ ప్రాక్టీసింగ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. వైస్‌చైర్మన్‌గా ఎన్.గణేష్, కార్యదర్శిగా కీర్తి గుప్తా, కోశాధికారిగా ఎం.బాలకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ లావణ్య కందూరి, హిమవిద్య, సి.వెంకట్‌రాంబాబు, ఎల్ఎన్.పృథ్వి, ఉషారాణి ఎన్నికయ్యారు.

రోడ్లపై చెత్త, మట్టి తొలగించాలి

- సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలం నేపథ్యంలో ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో బస్తీలు, కాలనీలలో, ప్రధానరహదారుల ఇరువైపులా చెత్త, మట్టికుప్పలు లేకుండా చర్యలు చేపట్టాలని ముషీరాబాద్ సర్కిల్ అధికారులను సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆదేశించారు. మంగళవారం ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో అడిక్‌మెట్ డివిజన్‌లోని జెడ్‌బీ గార్డెన్, దయానంద్‌నగర్, నాగమయ్యకుంట, విద్యానగర్ ప్రాంతాలలో జరిగిన మట్టి, చెత్త కుప్పల తొలగింపు స్పెషల్ డ్రైవ్‌ను వారు పరిశీలించారు. ఈ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ప్రతి డివిజన్‌లో మూడు రోజుల పాటు చెత్త, మట్టి ఇతర వ్యర్థాలను రోడ్ల పక్కన లేకుండా తొలగింపు చర్యలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు కూడా రోడ్లపై చెత్తనువేయొద్దన్నారు. వర్షా కాలంలో అంటూ రోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ గోవర్ధన్, శ్రీనివాస్, అంజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నందనవనం కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని నందనవనం కాలనీలో సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె నందనవనం కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, చెత్త మట్టికుప్పలను తరలించాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు మిరియల శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైలులో ఇద్దరు ప్రయాణికుల హ్యాండ్ బ్యాగుల చోరీ

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరుగా ఇద్దరు రైల్ ప్రయాణికుల హ్యాండ్ బ్యాగులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లలో నివాసం ఉంటున్న వినయ్ సేతియ భార్యతో కలిసి కాచిగూడకు రావడానికి బెంగళూరులో అశోకపురం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలో భార్య హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. దానిలో సెల్‌ఫోన్, ఏటీఎం, ఆధార్ కార్డు, రూ.6,500 నగదు ఉంది. మరో సంఘటనలో మంజుదేవి కాచిగూడకు రావడానికి మహారాష్ట్రలోని జాలూరు రైల్వేస్టేషన్‌లో కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నాందేడ్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. దానిలో సెల్‌ఫోన్, ఆధార్ కార్డు, రూ.5,500 నగదు ఉన్నాయి. వీరి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకుని, అనంతపురం రైల్వే పీఎస్, నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.